బీసీల ద్రోహి జగన్ : బీటీ



కర్నూలు(అర్బన్), జనవరి 4: బీసీల ద్రోహిగా సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోయాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. గురువారం కర్నూలు నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో బీసీలను కుర్చీలు, టేబుళ్లకే పరిమితం చేశారని ధ్వజమెత్తారు. జనాభాలో సగ భాగం ఉన్న బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వైసీపీ వాడుకుందన్నారు. తెలుగుదేశం పాలనలోనే బీసీలు సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో అభివృద్ధి సాధించారని అన్నారు. దీని కోసం చంద్రబాబు బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 16,800 మంది బీసీ నాయకులను పదవులకు దూరం చేసిన ద్రోహి జగన్‌మోహన్‌రెడ్డి అని మండిపడ్డారు.

ఆదోనిలో నిలిచిపోయిన క్లాప్ ఆటోలు



క్లాప్.. ఫ్లాప్...!

- జీతాల కోసం సమ్మెలో డ్రైవర్లు
- నిలిచిన చెత్త సేకరణ ఆటోలు
- పారిశుధ్యం ప్రైవేటు ఏజెన్సీకి..
- ఏడాదికి రూ.9 కోట్లు..
- ప్రజా ధనం దోచిపెడుతున్న వైనం

కర్నూలు(న్యూసిటీ), జనవరి 4: పరిసరాల పరిశుభ్రత.. ప్రజారోగ్యం బాధ్యత అంటూ ప్రభుత్వం చేపట్టిన క్లాప్ పథకం అట్టర్ ఫ్లాప్ అయిందన్న విమర్శలు ఉన్నాయి. పారిశుధ్యం మాట దేవుడెరుగు పన్నుల పేరుతో ప్రజల జేబులకు చిల్లు పెట్టి ప్రైవేట్ సంస్థకు దోచిపెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెత్త సేకరణలో భాగంగా కర్నూలు నగర పాలక సంస్థకు 93, ఆదోని 25, ఎమ్మిగనూరు మున్సిపాలిటీకి 14 ఆటోలను ప్రభుత్వం పంపింది. వీటిని ప్రభుత్వం సొంత నిధులతో కొనుగోలు చేసి మున్సిపాలిటీలకు ఇచ్చినట్లుగా ప్రారంభంలో అందరూ భావించారు. అయితే ఈ ఆటోలను విజయవాడలోని ఓ ప్రైవేట్ సంస్థ పంపిందని, నగర పాలక సంస్థ నెలకు ఒక్కో ఆటోకు రూ.63 వేలు అద్దె చెల్లిస్తోందని తెలిసింది. ఈ భారాన్ని చెత్త పన్ను పేరుతో ప్రజలపై వేస్తున్నారు. పన్ను వసూలు కోసం జనాల వద్దకు వెళ్తున్న వలంటీర్లకు మాత్రం తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో గతంలో వసూలు చేస్తున్న పన్నులో ప్రభుత్వం కొంత తగ్గించింది. దీంతో వలంటీర్లు పన్ను తగ్గించామంటూ మళ్లీ ఇళ్ల వద్దకు వస్తున్నారు. అయినా ప్రజల నుంచి మాత్రం సానుకూలత కనిపించడం లేదు. ఈ క్రమంలోనే జీతాలు అందడం లేదంటూ డ్రైవర్లు రోడ్డెక్కారు.



పారిశుధ్య విధానం మారుతోంది..

పాలకులు మారినప్పుడల్లా పారిశుధ్య విధానంలో మార్పులు వస్తున్నాయి. గతంలో కంటే భిన్నంగా ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం జగనన్న స్వచ్ఛ సంకల్పం అంటూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్(క్లాప్) అనే పథకాన్ని అమలు చేస్తోంది. అయితే ఈ క్లాప్ అమలుకు అవసరమైన డబ్బును పుర ప్రజల నుంచి వచ్చే పన్నుల నుంచి తీసుకుంటున్నారు. కర్నూలు నగర పాలక సంస్థకు 93, ఆదోని 25, ఎమ్మిగనూరు మున్సిపాలిటీకి 14 ఆటోలను ప్రభుత్వం పంపింది. అయితే ప్రభుత్వం సొంత నిధులతో కొనుగోలు చేసి మున్సిపాలిటీలకు ఇచ్చినట్లుగా ప్రారంభంలో అందరూ భావించారు. అయితే ఈ ఆటోలను విజయవాడలోని ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. దీంతో వాటికి నగర పాలక సంస్థ నెలకు రూ.63 వేలు అద్దె చెల్లిస్తోంది.

అద్దె భారమంతా ప్రజలపైనే..

ఆటోలకు చెల్లించే అద్దె భారమంతా ప్రజలపైనే పడుతోంది. కర్నూలు నగర పాలక సంస్థలో 71 ఆటోలకు నెలకు రూ.58,59,000 చొప్పున సంవత్సరానికి రూ.7.37 కోట్ల భారం పడుతోంది. అదే విధంగా ఆదోనిలో 21 ఆటోలకు నెలకు రూ.15,75,000 చొప్పున సంవత్సరానికి రూ.1,89,00,000, ఎమ్మిగనూరులో 14 ఆటోలకు నెలకు రూ.8,82,000 చొప్పున సంవత్సరానికి రూ.1,05,84,000 చెల్లించాల్సి వస్తోంది. గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ఆటోలకు అద్దె చెల్లిస్తున్నారు. ఆటోలను ఏర్పాటు చేసిన ఏజెన్సీకి అద్దె కింద ఇప్పటి వరకు కర్నూలు నగర పాలక సంస్థ రూ.6,02,57,000, ఆదోనిలో రూ.2.19,07,000, ఎమ్మిగనూరులో రూ.1,79,38,000 చెల్లించాల్సి వచ్చింది. చెత్త పన్ను వసూలు చేస్తూ పాలకులు ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు చెల్లిస్తున్న ఆస్తి పన్ను కన్నా చెత్త పన్ను అధికంగా ఉండటంతో ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. దీంతో గతంలో వసూలు చేసిన రూ.120 నుంచి రూ.60, రూ.60 నుంచి రూ.30కి తగ్గించారు. పారిశుధ్యానికి అవసరమైన సొమ్మును ఆస్తి పన్నులోనే వసూలు చేస్తున్నా క్లాప్ పేరుతో మున్సిపాలిటీలకు చెత్త పన్ను వసూలు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



సమ్మె చేస్తున్న ఆటో డ్రైవర్లు

నెలకు రూ.కోటిపైనే వసూలు..

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ఒకే ఏజెన్సీకి చెత్త సేకరణ బాధ్యత అప్పగించారు. కర్నూలు కార్పొరేషన్‌లో 1.13 లక్షల గృహాలతోపాటు వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. స్లమ్ ఏరియాలో రూ.30, నాన్‌స్లమ్ ఏరియాలో రూ.60 చెత్త పన్ను వసూలు చేస్తున్నారు. ఇక వాణిజ్య సముదాయం నుంచి వీధి వ్యాపారుల వరకు రూ.200, ఫంక్షన్ హాళ్లకు కెపాసిటీని బట్టి రూ.1500 నుంచి రూ.3000, సినిమా థియేటర్‌కు రూ.3000, ఆసుపత్రిలో పడకలను బట్టి రూ.1000 నుంచి రూ.3000, సూపర్‌మార్కెట్‌కు రూ.750, టెంకాయల అంగళ్లకు రూ.300 నుంచి రూ.600, టీ స్టాళ్లకు రూ.300 ఇలా రకరకరాలుగా పన్ను వసూలు చేస్తున్నారు. ఇలా నెలకు సుమారు రూ.కోటిపైనే జమ అవుతున్నట్టు తెలుస్తోంది.

జీతాలు లేక సమ్మెలోకి డ్రైవర్లు...

క్లాప్ ఆటో డ్రైవర్లలో కొందరికి ఆరు నెలలు, మరికొందరికి 12 నెలలుగా జీతాలు రాలేదు. దీంతో వారంతో ఆందోళనకు దిగారు. దీంతో పట్టణాల్లో చెత్త సేకరణ నిలిచిపోయింది. జిల్లాలోని ఎమ్మిగనూరు, ఆదోని, కర్నూలు నగరంలో క్లాప్ ఆటోలు ఉన్నాయి. వారం రోజుల క్రితం ఎమ్మిగనూరు, ఆదోని పట్టణాల్లో ఆటో డ్రైవర్లు జీతాలు ఇస్తేనే విధులకు హాజరవుతామని నిరసన తెలిపారు. అధికారులు వారికి హామీ ఇచ్చి నిరసన విరమింపజేశారు. అయితే రెండు రోజుల నుంచి నగర పాలక సంస్థ పరిధిలోని క్లాప్ ఆటో డ్రైవర్లు పెండింగ్ జీతాలు చెల్లిస్తేనే విధులకు హాజరవుతామని భీష్మించుకుని కూర్చున్నారు. నగరంలో క్లాప్ ఆటోలు తిరగకపోవడంతో ప్రత్యామ్నాయ చర్యలను అధికారులు చేపట్టారు. పారిశుధ్య కార్మికులతోనే ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి కార్పొరేషన్‌కు సంబంధించి ట్రాక్టర్లు, లారీల ద్వారా తరలిస్తున్నారు. అయితే ఇందులో కొందరు మూడు నెలలు, మరి కొందరికి రెండు నెలలుగా జీతాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే నగర పాలక సంస్థ అధికారులు మాత్రం డ్రైవర్లను నియమించింది కార్పొరేషన్ కాదని, వారి జీతభత్యాలు ఏజెన్సీ చూసుకుంటుందని చెబుతున్నారు. మూడు నెలల క్రితం చెత్త పన్ను వసూలు తక్కువ కావడంతో కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి ఆటోల అద్దె చెల్లించినట్లు తెలుస్తోంది. అయితే డ్రైవర్లకు మాత్రం జీతాలు చెల్లించలేదు. ఈ క్రమంలోనే పెండింగ్ జీతాలు ఇచ్చే వరకు విధులకు హాజరు కాబోమని డ్రైవర్లు ఖరాఖండిగా చెబుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నాం



నగరంలో క్లాప్ ఆటోలు రాకపోవడంతో ఇబ్బంగా ఉంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నాం. క్లాప్ ఆటోలకు సంబంధించి డ్రైవర్ జీతాలు, మరమ్మతుల ఖర్చులను ఏజెన్సీ చెల్లిస్తుంది. ఆటోల వెంట ఉడే ఇద్దరు లోడర్స్‌కు మాత్రం కార్పొరేషన్ చెల్లిస్తుంది. 52 వార్డులకు 120 ఆటోలు కావాల్సి ఉండగా ప్రస్తుతం 93 ఉన్నాయి. కార్మికులకు ఈఎస్ఐ కార్డులు, ఈపీఎఫ్ నెంబర్లు ఇవ్వడంలో ఏజెన్సీ జాప్యం చేస్తోందని కొందరు నా దృష్టికి తీసుకువచ్చారు. కొందరికి జూన్ నుంచి జీతాలు రాలేదని చెప్పారు. అకౌంట్స్ సెక్షన్ నుంచి సెప్టెంబర్, అక్టోబరు వరకు సీఈఎంఏకు బిల్లులు వెళ్లాయి. నవంబరుకు సంబంధించి ఏజెన్సీ ఇంకా బిల్లులు సబ్మిట్ చేయలేదు. డ్రైవర్లతో చర్చిస్తున్నాం. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నా.

- డా.కే.విశ్వేశ్వరరెడ్డి మెడికల్ హెల్త్ ఆఫీసర్, నగర పాలక సంస్థ, కర్నూలు

పెండింగ్ జీతాలు చెల్లించాలి



సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే డ్రైవర్లకు చెల్లించాలి. మూడు నెలల క్రితం జీతాలు రాకపోవడంతో సమ్మె చేశాం. అక్టోబరు నుంచి జీతాలు ఇస్తామని నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవతేజ హామీ ఇవ్వడంతో సమ్మె విరమించాం. అయితే ఇప్పటి వరకు కూడా జీతాలు ఇవ్వలేదు. దీంతో సమ్మె బాట పట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఒప్పందం ప్రకారం డ్రైవర్లకు రూ.18500 వేతనం అమలు చేయాలి. ప్రధాన డిమాండ్లను పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తాం.

ఎండీ అంజిబాబు,
సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

సమస్యల పరిష్కారంలో వైసీపీ విఫలం

ఆకులు నోట్లో పెట్టుకుని కార్మికుల నిరసన



కార్పొరేషన్ ఎదుట నోట్లో ఆకులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 4: కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప అన్నారు. మున్సిపల్ కార్మికులు గురువారం రెండో రోజు ఎస్టీబీసీ కళాశాల నుంచి కార్పొరేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్పొరేషన్ ఎదుట ఆకులు నోట్లో పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని రెండు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన జగన్ మోహన్‌రెడ్డి ఆ తరువాత విస్మరించారని అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజి బాబు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులకు డ్రైవర్ల సమ్మె కనబడటం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, నాయకులు బాబులాల్, మాణిక్యం, సవారి పాల్గొన్నారు.

కాటసాని అడ్డాలో వైసీపీ సభకు జనం కరువు

- సామాజిక సాధికార బస్సు యాత్ర తుస్సు
- నేతలు ప్రసంగిస్తుండగానే వెళ్లిపోయిన జనం



సభలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కర్నూలు(అర్బన్), జనవరి 4: సామాజిక సాధికార సభ పేరుతో వైసీపీ జనసమీకరణ చేస్తున్నా ఆ పార్టీకి ప్రజల నుంచి ఆదరణ కరువవుతోంది. గురువారం నగరంలోని చెన్నమ్మ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సభ మరోసారి తుస్సుమంది. సీనియర్ ఎమ్మెల్యేగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో చక్రం తిప్పుతున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి సొంత నియోజకవర్గంలో బస్సు యాత్రకు ప్రజల నుంచి స్పందన కరువైంది. ఊహించిన దానికంటే జనం తక్కువగా వచ్చారు. వచ్చిన వాళ్లు కూడా వైసీపీ నేతలు ప్రసంగాలు చేస్తుండగానే వెనుదిరిగి వెళ్లిపోయారు. సభ ప్రారంభమైన అరగంటకే కుర్చీలు ఖాళీ కావడంతో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌కు చెందిన ప్రధాన అనుచరుడు గుర్తించి వలంటీర్లను అప్రమత్తం చేసేందుకు ప్రయత్నం చేశారు. గడివేముల, పాణ్యం మండలాల నుంచి కార్యకర్తలు, నాయకులను తరలించేందుకు కీలక నాయకులు ఆపసోపాలు పడ్డారు. సాయంత్ర 5 గంటలకు చెన్నమ్మ సర్కిల్‌లో సభా ప్రాంగణానికి చేరుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు వేదికపైకి చేరుకోగానే ప్రజలకు అభివాదం చేసేందుకు పోటీ పడ్డారు. కానీ ప్రజల నుంచి స్పందన కరువైంది. కీలక నాయకులు మాట్లాడుతుండగానే ఖాళీ అయిన కూర్చీలను వైసీపీ కార్యకర్తలే తొలగించడం కనిపించింది.

ఎమ్మిగనూరు వైసీపీలో ముసలం!

- వైసీపీ సమన్వయకర్తగా మాచాని ప్రకటనతో ధిక్కార స్వరం
- గడప దాటని ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి
- ఆగ్రహంతో రగిలిపోతున్న రుద్రగౌడ్ వర్గం
- తాడేపల్లి ప్యాలెస్‌కు చేరిన బుట్టా రేణుక
- ఎంపీ టికెట్ అయినా ఇవ్వాలని పట్టు

కర్నూలు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి):

'నియోజకవర్గంలో పరిస్థితులు అధిష్టానానికి ఏం తెలుస్తాయి..? నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకోకుండా అభ్యర్థిని ప్రకటిస్తారా..? ఐప్యాక్ తప్పుడు సర్వేలు చేసింది. అధిష్టానం నిర్ణయం మార్చుకోకపోతే అభ్యర్థి గెలుపుపై ఆశలు వదులుకోవాల్సిందే..'
- ఎమ్మిగనూరులో అధికార పార్టీ నాయకుల స్వరం

ఎమ్మిగనూరు నియోజకవర్గం వైసీపీ సమన్వకర్త (రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి)గా చేనేత సామాజికవర్గానికి చెందిన మాచాని వెంకటేశ్‌ను సీఎం జగన్ సూచనల మేరకు అధిష్టానం చేసిన ప్రకటనతో ఆ పార్టీలో అలజడి మొదలైంది. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి వయోభారం, ఆయన కొడుకు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి గెలిచే ఛాన్స్ లేదని ఐప్యాక్ సర్వే నివేదికలతో బీసీలకు టికెట్ ఇవ్వాలని వైసీపీ నిర్ణయం తీసుకుంది. చేనేత సామాజికవర్గానికి చెందిన మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఏపీ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్ తీవ్రంగా ప్రయత్నించారు. వీరిలో ఒకరికి టికెట్ ఖాయమని భావించారు. వీళ్లకు టికెట్ ఇస్తే రాజకీయంగా తన పెత్తనం ఎక్కడ సన్నగిల్లుతుందో అని భావించారో..? రాజకీయ విశ్లేషకుల ఊహలకు అందని విధంగా మాచాని వెంకటేశ్ పేరును ఎమ్మెల్యే ఎర్రకోట తెరపైకి తెచ్చారు. ఇది వైసీపీ నాయకులు, కార్యకర్తలను మింగుడుపడటం లేదు. 'పెద్దాయనా కనికరించు..' అని రుద్రగౌడ్ వేడుకున్నా ఎర్రకోట నో చెప్పారు. దీంతో రుద్రగౌడ్ వర్గం ఆగ్రహంతో రగిలిపోతోంది. ఇక ఎంపీ టికెట్ అయినా ఇవ్వాలని బుట్టా రేణుక తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుకుంది. తండ్రి నిర్ణయంపై మనోవేదనతో రగిలిపోతున్న తనయుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి గడప దాటి రావడం లేదు.

ఎమ్మెల్యే ఎర్రకోట ఇంట ముసలం



ఎమ్మిగనూరు వైసీపీ సమన్వయకర్తగా మాచాని వెంకటేశ్ ప్రకటనతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లోనే కాదు ఎమ్మెల్యే ఎర్రకోట ఇంటి ముసలం పుట్టిందని అంటున్నారు. వైసీపీ అభ్యర్థిగా బీసీ సామాజికవర్గానికి చెందిన బుట్టా రేణుక, వై.రుద్రగౌడ్‌లలో ఒకరిని ప్రకటిస్తారని భావిస్తే.. విరుద్ధంగా ఎమ్మెల్యే ఎర్రకోట మాచాని వెంకటేశ్ పేరును తెరపైకి తెచ్చారు. సీఎం జగన్ కూడా ఆయన డిమాండ్ తలొగ్గారు. ఈ నిర్ణయాన్ని ఎర్రకోట వర్గీయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అధిష్టానం తీసుకున్న నిర్ణయంపై పునరాలోచించాలని, ఐప్యాక్ తప్పుడు నివేదిక ఇచ్చిందని ఎమ్మెల్యే ఎర్రకోటకు అత్యంత సన్నిహితులైన ఎంపీపీ కేశన్న, ముగతి, దేవిబెట్ట సర్పంచులు విరుపాక్షిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, కోటేకల్లు సర్పంచి భర్త లక్ష్మన్న, సీనియర్ నాయకుడు సోగనూరు భీమరెడ్డి తదితరులు బహటంగానే ధిక్కార స్వరం వినిపించారు. అంతేకాదు తండ్రి నిర్ణయంపై తనయుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి కూడా తీవ్ర మనోవేదనకు గురవ్వడమే కాకుండా నాలుగు రోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ముఖ్య నాయకులను కూడా కలవడం లేదని సమాచారం. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్ సహా ఎమ్మెల్యేకు ముఖ్య సహచరులుగా ఉన్న నాయకులు అధిష్టానం నిర్ణయంపై మండిపడుతున్నారు. రాజకీయ వ్యూహంలో భాగంగానే మాచాని వెంకటేశ్ పేరును ఎమ్మెల్యే ఎర్రకోట తెరపైకి తెచ్చి సరికొత్త రాజకీయ డ్రామాకు తెర తీశారా..? బుట్టా రేణుక, రుద్రగౌడ్‌లకు టికెట్ ఇస్తే తన కుటుంబ రాజకీయ పెత్తనానికి ఎక్కడా బ్రేక్‌లు పడుతాయో అని భావించే రాజకీయాలకు కొత్త అయిన వెంకటేశ్‌ను తెరపైకి తెచ్చి ఉంటారని పలువురు చర్చించుకుంటున్నారు. అంతేకాదు.. తన అనుచరులు, సన్నిహితులతో మాచాని వెంకటేశ్ గెలవడు.. ఓడిపోతాడు.. ఎమ్మెల్యే సీటు వదులుకోవాల్సిందే.. అంటూ వ్యూహాత్మకంగా ప్రచారం చేయించి అధిష్టానమే పెద్దాయన నీవే పోటీ చేయాలనే పరిస్థితి తీసుకురావాలనే రాజకీయ ఎత్తుగడలో భాగంగానే బుట్టా, రుద్రగౌడ్‌లకు అంకురంలోనే చెక్ పెట్టాడని విశ్లేషకులు భావిస్తున్నారు.

రుద్రగౌడ్ పయనమెటు?



పెద్దాయనా..! 1994, 2014, 2019 ఎన్నికల్లో మీ వెంటే నడిచాం.. మీ కొడుకు, మీరు గెలవాలని మా కుటుంబం మొత్తం కష్టపడ్డాం. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్ ఎమ్మిగనూరు వైసీపీ టికెట్ బీసీలకు ఇవ్వాలని నిర్ణయించారు.. ఈ ఒక్కసారి నాకు టికెట్ వచ్చేలా సహకరించు..! అంటూ ఏపీ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్ ఈ నెల 29న విజయవాడలో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డిని కలసి విన్నవించాడు. అయినా పెద్దాయన వినిపించుకోలేదు. దీనిపై రుద్రగౌడ్ వర్గం ఆగ్రహంతో రగిలిపోతోంది. రెండు ఎన్నికల్లో ఎర్రకోట కుటుంబం గెలుపు కోసం కష్టపడితే ఇదే మాకు ఇచ్చిన మర్యాద ఇదేనా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తాడేపల్లి ప్యాలెస్‌లో సీఎంను కలసి వస్తున్న ఎమ్మెల్యే ఎర్రకోట తదితరులు (ఫైల్)

పట్టు వదలని బుట్టా



ఎమ్మిగనూరు టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ ఎంపీ బుట్టా రేణుక కర్నూలు ఎంపీ టికెట్ అయినా ఇవ్వాలని వైసీపీ అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. గురువారం విజయవాడలోని తాడేపల్లి ప్యాలెస్‌కు ఆమె చేరుకుని వైసీపీ ముఖ్య నాయకులను కలిశారు. ఎర్రకోట చెన్నకేశవరెడ్డికి వ్యతిరేకంగా తాను ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని, అవసరమైతే ఆయనకు క్షమాపణలు చెప్పేందుకైనా తాను సిద్ధమే.. తనకు సహకరించాలని కోరినా పెద్దాయన తనను వ్యతిరేకించారని ఆమె కొందరు సన్నిహితుల వద్ద వాపోయినట్లు సమాచారం. కర్నూలు ఎంపీగా మంత్రి గుమ్మనూరు జయరాంను పోటీకి దింపాలని సీఎం జగన్ ఇప్పటికే స్పష్టత ఇచ్చారు. ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్‌కు మళ్లీ అవకాశం ఇచ్చే ఆలోచన అధిష్ఠానానికి లేదు. ఈ క్రమంలో కర్నూలు ఎంపీగా అయినా తనకు అవకాశం ఇవ్వాలని రేణుక కోరుతున్నారు.

బదిలీలకు వేళాయే..!

- ఎన్నికల దృష్ట్యా ఎలక్షన్ కమిషన్ కసరత్తు
- సిద్ధమవుతున్న అధికారుల జాబితా




కర్నూలు(కలెక్టరేట్), జనవరి 4: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో అధికారుల బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ తాజాగా మెమో 1,284 ఉత్తర్వులను జారీ చేసింది. ఎన్నికల విధులు నిర్వహించే ఐఏఎస్, ఐపీఎస్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి, డిప్యూటీ డీఈఓ, ఆర్ఓ, ఏఆర్వోలు, ఈఆర్వో, ఏఈఆర్వో, ఏడీఎం, ఎస్‌డీఎం, పోలీసు శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్లు, సీఐలు, డీఎస్పీలు, ఏఎస్పీలు అధికారులు బదిలీల జాబితాలో ఉంటారు. 2024 జూన్ 30 నాటికి మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి బదిలీ తప్పనిసరి. ఈ క్రమంలో కొందరు అధికారులు తమకు అనుకూలమైన ప్రాంతాలకు బదిలీ చేయించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. మొత్తం మీద జనవరి 31లోపు అధికారులు బదిలీ కానున్నారు. ఆరు నెలల వ్యవధిలో విరమణ చేయనున్న జిల్లా అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మినహాయింపు ఇచ్చింది.



ఆదాయం కోసం అడ్డ దారులు..!


- వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో దోపిడీ
- బయటి ల్యాబ్‌లకు రాస్తున్న వైద్యులు
- చెప్పిన చోటే చేయించాలని హుకుం
- లేదంటే వైద్యం చేయని వైనం
- ఓ చిన్నారి విషయంలో తేటతెల్లం
- గైనిక్ వార్డులోనూ ఇదే పరిస్థితి
- చర్చనీయాంశంగా మారిన ఓ ఉద్యోగి తీరు
- ఆవేదనకు గువుతున్న పేదలు

కర్నూలు(హాస్పిటల్), జనవరి 4: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రాసే వైద్య పరీక్షలు ప్రైవేటు ల్యాబ్‌లకు సిరులు కురిపిస్తున్నాయి. కొందరు వైద్యులు కమీషన్ కోసం.. ల్యాబ్‌ల యజమానులు ఆదాయం కోసం పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. గ్రామీణ ప్రాంత రోగులే టార్గెట్‌గా కొందరు వైద్యులు, పీజీలు, హౌస్ సర్జన్లు వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో వాటాలు తీసుకుంటూ దందా సాగిస్తున్నారు. తాము చెప్పిన ల్యాబ్‌లోనే పరీక్షలు చేయించాలని చీటీలు రాసి పంపుతున్నారు. వేరే ల్యాబుల్లో పరీక్షలు చేయిస్తే వైద్యం చేయడానికి నిరాకరిస్తున్నారు. గైనిక్ ఓపీలో ఓ మహిళా ఉద్యోగి టెస్టులు బయటకు రాసి పంపుతూ ప్రతి రోజూ రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు కమీషన్ తీసుకుంటున్నట్టు సమాచారం. చివరకు సెక్యూరిటీ గార్డులు కూడా ఇదే పద్ధతికి అలవాటు పడినట్టు తెలుస్తోంది. దీన్ని బట్టి కర్నూలు ప్రభుత్వాసుపత్రి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆస్పత్రిలో అన్ని పరీక్షలు ఉచితంగా చేస్తున్నా బయటకు రాసి పంపడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఉషా ల్యాబ్‌కు రాసిన పరీక్షలు





రాయలసీమ ల్యాబుకు రాసిన పరీక్షలు

కర్నూలు జీజీహెచ్‌కు రాయలసీమలోనే మంచి పేరు ఉంది. ఇక్కడికి రాయలసీమలోని కడప, అనంతపురం జిల్లాలతోపాటు, ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రాంతం నుంచి కూడా రోగుల వస్తుంటారు. అలాగే కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన రోగులు కూడా ఈ ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. ఇంత పెద్ద ఆసుపత్రిలో ఓపీకి ప్రతి రోజూ మూడు వేల మంది వస్తుండగా ఇందులో 300 మంది అడ్మిషన్ పొందుతున్నారు. ఆసుపత్రిలో 1050 పడకలు ప్రభుత్వం మంజూరు చేయగా, 1500 మంది రోగులు అడ్మిషన్‌లో ఉంటున్నారు. ఇంత పెద్దాసుపత్రిలో వైద్య పరీక్షల కోసం ప్రతి నెలా రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు ఖర్చు పెడుతున్నా ప్రైవేటు ల్యాబ్‌ల దోపిడీ మాత్రం ఆగడం లేదు.

● ఆ రెండు ల్యాబ్‌లకే..!

ఆసుపత్రి ఎదుట బుధవారపేటలో ఉన్న రెండు ల్యాబ్‌లకే ఎక్కువగా రోగులను పంపిస్తున్నట్టు సమాచారం. ఇక్కడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిర్ధారించిన పరీక్షల ధరలకంటే ఎక్కువ వసూలు చేస్తున్నారు. పీడియాట్రిక్ విభాగం మొత్తం బుధవారపేటలో ఉన్న ఓ ల్యాబ్‌కు పరీక్షలు రాస్తుండగా.. ఏఎంసీ, క్యాజువాల్టీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, గైనిక్, సర్జరీ వార్డులు ఇక్కడే ఉన్న మరో ల్యాబ్‌కు రాసి ఇవ్వడం గమనార్హం. సాధారణ ధరల కంటే అధికంగా రోగుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. అత్యవసర ఆపరేషన్ చేయాలంటే బయట నుంచి పరీక్షలు చేయించుకొని రావాలని కొందరు వైద్యులు, జూనియర్ డాక్టర్లు రెఫర్ చేస్తున్నారు. ఇదే అదునుగా అర్హత లేని కొన్ని ల్యాబ్‌లు దందా సాగిస్తున్నాయి. ఆసుపత్రి గేటు వద్ద దళారులను నియమించుకొని రోగులను తమ ల్యాబ్‌లకు తరలించుకుపోతున్నాయి. అత్యవసరం పేరుతో అధిక వసూళ్లకు పాల్పడుతున్నాయి.

గైనిక్ ఓపీలో థైరాయిడ్ టెస్టు బయటకు..

గైనకాలజీ విభాగంలోని ఓపీ విభాగంలో గర్భిణులకు ఎంతో ముఖ్యమైన థైరాయిడ్ పరీక్షలు బయటకు వెళ్తున్నాయి. గైనిక్ ఓపీలో ఉన్న ఓ మహిళా ఉద్యోగి ప్రైవేటు ల్యాబ్‌లతో కుమ్మక్కు కావడంతో ప్రతి రోజూ ఈ టెస్టులు బయటి వెళ్లిపోతున్నాయి. ప్రతి రోజూ గైనిక్ ఓపీకి 200 నుంచి 250 మంది సాధారణ రోగులు వస్తుంటారు. ఇందులో 40 మంది అడ్మిషన్ పొందుతుంటారు. గర్భిణుల అత్యవసర పరిస్థితిని ఆసరా చేసుకొని ఓ మహిళా ఉద్యోగి ప్రైవేటు ల్యాబ్ సిబ్బంది ఫోన్ నెంబర్ ఇచ్చి బయట చేయించుకోవాలని తెలియజేస్తోంది. ప్రతి రోజూ 50 నుంచి 60 థైరాయిడ్ టెస్టులను ఈ ఉద్యోగి బయటకు పంపుతోంది. ల్యాబ్‌లో థైరాయిడ్ టెస్టు ఒకటి రూ.500. ప్రైవేటు ల్యాబ్‌కు థైరాయిడ్ టెస్టులను పంపడం వల్ల ప్రతి రోజూ ఆ ఉద్యోగికి రూ.3 వేల నుంచి రూ.4 వేలు కమీషన్ వస్తుంది. ఏళ్ల తరబడి గైనిక్ ఓపీ కేంద్రంలో ఉండటం కోసం ప్రతి నెలా నర్సింగ్ ఆఫీసుకు ముడుపులు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

దందా సాగేది ఇలా...

రోగి పరీక్షలకు ప్రైవేటు ల్యాబ్‌లో రూ.1000 అయితే.. ఈ టెస్టుకు బయటకు రాసిన పీజీ, హౌస్ సర్జన్‌లకు రూ.500 కమీషన్ వస్తుంది. అంటే ప్రతి వ్యాధి నిర్ధారణ పరీక్షకు కొందరు పీజీ, మరికొందరు హౌస్ సర్జన్లకు 50 శాతం కమీషన్‌ను ల్యాబ్ నిర్వాహకులు ముట్టజెబుతున్నట్లు సమాచారం. ప్రతి నెలా 1వ తేదీ జీతం వచ్చినట్లే వీరికి ల్యాబ్‌ల నుంచి కమీషన్ వస్తున్నట్టు తెలుస్తోంది. ల్యాబ్‌ల నిర్వాహకులు నేరుగా ఆసుపత్రిలోని వార్డులకు వచ్చి పీజీలు, హౌస్ సర్జన్లకు కమీషన్‌ను ఇస్తారు. ఇక కొందరి పీజీలు, కొందరు హౌస్ సర్జన్లకు సంబంధించిన కార్లు, బైకు ఈఎంఐలు ప్రైవేటు ల్యాబ్ నిర్వాహకులు కడుతున్నట్టు సమాచారం. దీన్ని పరిస్థితి ఇంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ దందాపై విజిలెన్స్ అధికారులు, ఆసుపత్రి సూపరింటెండెంట్, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదులు అందినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు.



ఆ ల్యాబ్‌లో చేయిస్తేనే వైద్యం

దాదాపు 35 రోజుల క్రితం చిన్న పిల్లల విభాగంలోని పీఐసీయూలో ఎమ్మిగనూరు ప్రాంతం నుంచి వచ్చిన ఓ చిన్నారిని అడ్మిషన్ చేయించారు. ఏడు నెలలకే ఆడ శిశువు జన్మించడం వల్ల ఆ చిన్నారికి ఊపిరి తీసుకోలేకపోవడం, హార్ట్‌బీట్ తక్కువ సమస్యలు తలెత్తాయి. ఆ వార్డులో విధులు నిర్వహిస్తున్న ఓ పీజీ పేటలో ఉన్న ల్యాబ్‌లో టెస్టులు చేయించుకోవాలని బుధవారం రాసి పంపించారు. అయితే ఆ చిన్నారి తండ్రి పీజీ చెప్పిన ల్యాబ్‌లో కాకుండా పక్కన ఉన్న ప్రైవేటు ల్యాబ్‌లో పరీక్షలు చేయించారు. ఆ రిపోర్టులను తెచ్చి పీజీకి ఇవ్వడంతో వాటిని చించి వేసి ముఖం మీద కొట్టారు. చిన్నారి తండ్రిపై కోపంతో ఊగిపోయారు. తాను చెప్పిన ల్యాబ్‌లో పరీక్షలు చేయిస్తేనే వైద్యం చేస్తానని చెప్పడంతో ఆ చిన్నారి తల్లిదండ్రులు నివ్వెరపోయారు. పీజీ డాక్టర్ ఇంత కఠినంగా వ్యవహరించడం బాధ వేసిందని, డబ్బులు తక్కువగా ఉన్నాయని, అందుకే మరో ల్యాబ్‌లో టెస్టులు చేయించుకున్నామని వారు వాపోయారు. పేదలు కావడం వల్లే తమను చిన్న చూపు చేశారని తోటి రోగుల బంధువుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పీజీ చెప్పిన ల్యాబ్‌లో టెస్టు చేయించుకున్న తర్వాతనే వైద్యం జరిగింది.

టెస్టులు బయటకు పంపకూడదు

ఆసుపత్రిలో రోగుల నిర్ధారణ పరీక్షలను బయటి ల్యాబ్‌లకు పంపకూడదు. న్యూడయాగ్నోస్టిక్ బ్లాకుకు పరీక్షల కోసం ప్రతి నెలా దాదాపు రూ.25 లక్షలు ఖర్చు పెడుతున్నాం. అయినా పరీక్షలు బయటకు వెళ్తున్నాయి. రోగి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతోపాటు ఆసుపత్రిలో అందుకు సంబంధించిన పరీక్షలు లేకుంటే అప్పుడు బయటకు పంపవచ్చు. దీనిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి రోగుల కేషీట్‌లను పరిశీలిస్తాం.

- డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, సూపరింటెండెంట్, కర్నూలు ప్రభుత్వాసుపత్రి

సెక్యూరిటీ గార్డులు సైతం..

ఆసుపత్రిలో రోగుల భద్రత కోసం నియమించిన సెక్యూరిటీ గార్డులు దళారుల అవతారమెత్తారు. ప్రైవేటు ల్యాబ్‌లు, రోగులకు అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తున్నారు. రోగులకు వైద్యులు రాసిచ్చిన పరీక్షల శాంపిల్స్‌ను ప్రైవేటు ల్యాబ్ సిబ్బందికి అప్పగిస్తారు. ప్రైవేటు ల్యాబ్ సిబ్బందిని అరికట్టాల్సిన సెక్యూరిటీ గార్డులే దళారులుగా మారడం గమనార్హం. ఇందుకుగాను ప్రైవేటు ల్యాబ్‌ల నిర్వాహకులు ఐదు శాతం కమీషన్ ముట్టజెబుతారు. వీటితో పాటు వారానికోసారి మందు పార్టీ కూడా ఏర్పాటు చేస్తున్నట్టు తెలుస్తోంది.

13 మంది సీఐల బదిలీ

కర్నూలు, జనవరి 4: జిల్లా వ్యాప్తంగా 13 మంది సీఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం రాత్రి ఎస్పీ జి.కృష్ణకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయినవారు తక్షణమే విధుల్లో జాయిన్ కావాలని ఆయన ఆదేశించారు. బదిలీ అయిన పోలీసుల వివరాలు...

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎస్.తేజోమూర్తి	వీఆర్ కర్నూలు	ఆదోని వన్‌టౌన్
డి.గోపి	వీఆర్ కర్నూలు	ఆదోని టూటౌన్
కె.శ్రీనివాస నాయక్	ఆదోని టూటౌన్	వీఆర్, కర్నూలు
బీ.ఏ మంజునాథ్	కర్నూలు త్రీటౌన్, అటాచ్డ్ పీసీఆర్	ఆదోని ట్రాఫిక్
ఎం.పార్థసారధి	ఆదోని ట్రాఫిక్ పీఎస్	వీఆర్, కర్నూలు
ఎం.ఉపేంద్రబాబు	సీసీఎస్, కర్నూలు	వీఆర్, కర్నూలు
ఎం.ఆదిలక్ష్మి	సీసీఎస్, సెబ్	వీఆర్, కర్నూలు
ఎం.నాగశేఖర్	సీసీఎస్-త్రీ, కర్నూలు	వీఆర్, కర్నూలు
యు.లక్ష్మయ్య	దిశ పీఎస్	వీఆర్, కర్నూలు
కళా వెంకటరమణ	దిశ పీఎస్	వీఆర్, కర్నూలు
కె.శ్రీరాములు	కర్నూలు తాలుకా	వీఆర్, కర్నూలు
కె.ఎరిషావలి	వీఆర్, కర్నూలు	మంత్రాలయం
కె.శ్రీనివాసులు	మంత్రాలయం	వీఆర్, కర్నూలు

ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు

టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జనవరి 4: వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని హుశేనాపురంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీకి గుడ్‌బై చెబుతున్నారని అన్నారు. సీఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని, రాజీనామా చేసే వారిని నిలుపుకు నేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు 38 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ప్రజలకు భయపడి సొంత నియోజకవర్గంలో పోటీ చేసేందుకు సిద్ధంగా లేరన్నారు. ఎమ్మెల్యేలు ప్రజలకు సేవ చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పటికే మరో 50 మంది అభ్యర్థులు పార్టీ మారే ఆలోచనలో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్.మహ బూబ్‌బాషా, నాయకులు కేవీ మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్య గ్యాంగ్ వార్

ఇద్దరికి కత్తి పోట్లు, ఆసుపత్రికి తరలింపు

నంద్యాల క్రైం, జనవరి 4: నంద్యాల పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల కేంద్రంగా విద్యార్థుల మధ్య గ్యాంగ్‌వార్ జరిగింది. టెక్కెలోని మున్సిపల్ స్కూల్ వద్ద గురువారం రాత్రి ఇద్దరు విద్యార్థులు కత్తి పోట్లకు గురయ్యారు. పట్టణంలోని వీసీ కాలనీలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల్లో రెండు వర్గాలు ఉన్నాయి. ఈ రెండు వర్గాల మధ్య కొంత కాలంగా గొడవలు ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం ఒక వర్గానికి చెందిన హనీష్, హేమంత్‌లను మరో వర్గానికి చెందిన చరణ్ సుభాష్, ఫయాజ్‌లు రాత్రి 'మా వారితో గొడవ పడతారా' అంటూ కత్తులతో పొడిచారు. గాయపడిన హనీష్, హేమంత్‌లను నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మొదట పాలిటెక్నిక్ కాలేజీ వద్ద హనీష్, చరణ్ గ్యాంగ్‌ల మధ్య ఘర్షణ జరిగింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించిన ఇరువర్గాలు అక్కడి నుంచి పరారయ్యాయి. తిరిగి రాత్రి టెక్కె ప్రాంతంలో ఇరువర్గాలు ఎదురెదురు పడటంతో కత్తిపోట్ల ఘటన చోటుచేసుకుంది. దాడికి పాల్పడిన చరణ్ గ్యాంగ్ పరారీలో ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీతోనే కార్మిక వర్గానికి న్యాయం

కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జనవరి 4: తెలుగుదేశం పార్టీతోనే కార్మిక వర్గానికి న్యాయం జరుగుతుందని పార్టీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. గురువారం మౌర్యాఇన్ హోటల్‌లో తన కార్యాలయంలో టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో టెక్కలి నుంచి కుప్పం వరకు ఈనెల 6న చేపట్టబోయే కార్మిక బస్సుయాత్ర పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్మిక బస్సుయాత్ర చేపడుతున్నామన్నారు. ఈనెల 6న బస్సు యాత్రను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం టీఎన్‌టీయూసీ గవర్నమెంట్ ప్రింటింగ్ ప్రెస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. టీఎన్‌టీయూసీ పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహులు, సిటీ ప్రెసిడెంట్ పాల్‌రాజ్, నాయకులు ప్రభాకర్, పుల్లయ్య పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సి.బెళగల్, జనవరి 4: మండలంలోని బురాన్‌దొడ్డి, మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ శేషఫణి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చూడాలని బూతు అధికారులను ఆదేశించారు. ఆయన వెంట పోలింగ్ బూతుల అధికారులు నాగమ్మ, శేఖర్ ఉన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 4: కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో పనిచేస్తున్న కార్మికులు, అసిస్టెంట్లకు అండగా ఉంటామని చైర్మన్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఇటీవల విధి నిర్వహణలో ఉంటూ మరణించిన కుమ్మరి రామకృష్ణ కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా రూ.2 లక్షల చెక్కును చైర్మన్ అందజేశారు. కార్యక్రమంలో సెల క్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు, సెక్రటరీలు వెంకటేశ్, రెహిమాన్, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్ పాల్గొన్నారు.

షర్మిల రాకతో కాంగ్రెస్ బలపడుతుంది



సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(అర్బన్), జనవరి 4: వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పార్టీ మరింత బలపడుతుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యుడు కే.బాబురావు అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో షర్మిల చేరికను పురస్కరించుకుని నాయకులు, కార్యకర్తలు, బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిష్టానం నిర్ణయం మేరకు ప్రతి కార్యకర్త కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా పనిచేస్తారన్నారు. ఈకార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బీ.బతుకన్న, ఎస్సీసెల్ అధ్యక్షు డు లాజరస్, మహబూబ్ మున్న, యజాస్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని విరమించుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), జనవరి 4: రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని విరమించుకోవాలని ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కే.ప్రభాకర్ కోరారు. కార్మిక కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 8 కలెక్టరేట్, మండల కార్యాలయాల ఎదుట జరిగే ఆందోళనకు అధిక సంఖ్యలో డ్రైవర్లు హాజరు కావాలని పిలు పునిచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఎలాగైన అధికారంలోకి రావాలన్న ఉద్దేశంతో అధికారపక్షం, ప్రతిపక్షం పోటీపడి అమలు కాలని హామీలు ఇస్తున్నారని అన్నారు. ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణం వల్ల కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో ఆటోలకు బాడుగలు లేక డ్రైవర్లు దీనస్థితిలో ఉన్నారని అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం అమ లు చేస్తే ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.12వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తిమ్మప్ప, ఉపాధ్యక్షులు బి.రాధాక్రిష్ణ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి వస్తేనే పింఛన్

- లబ్ధిదారులపై అధికారుల ఒత్తిడి
- ఇబ్బందులు పడిన వృద్ధులు, దివ్యాంగులు
- చివరకు 20 మందికే పంపిణీ

కర్నూలు(న్యూసిటీ), జనవరి 4: సమావేశానికి వస్తేనే పింఛన్ ఇస్తామని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఒత్తిడి చేయడంతో లబ్ధిదారులు వ్యయప్రయాసలతో నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. అయితే చివరకు 20 మందికి మాత్రమే పంపిణీ చేయడంతో అసహనం వ్యక్తం చేవారు. గురువారం ఎగ్జిబిషన్ మైదానంలో పింఛన్ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కర్నూలు నియోజకవర్గ పరిధిలో 75 సచివాలయాలు ఉండగా అందులో 19,474 పింఛన్లు ఉన్నాయి. పింఛన్ పంపిణీ కార్యక్రమంలో 25 సచివాలయాల నుంచి ఒక్కో లబ్ధిదారుని ఎంపిక చేసి 20 మందికే పంపిణీ చేశారు. దీంతో మిగిలిన వారంతా



పింఛన్ కోసం వస్తున్న వృద్ధులు



పింఛన్ కోసం నేలపై కూర్చొని నిరీక్షిస్తున్న వృద్ధులు

ఉసూరుమంటూ వెనుదిరగాల్సి వచ్చింది. పింఛన్ ఇవ్వకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. పింఛన్ ఇస్తామని పిలిపించి తీరా ఇక్కడికి వచ్చాక ఇళ్ల వద్దే ఇస్తామని చెబుతున్నారని, ముసలోళ్లు ఎలా వస్తారనే ఇంకిత జ్ఞానం కూడా లేదా అని కప్పల్‌నగర్‌కు చెందిన సుగుణమ్మ అనే వృద్ధురాలి మండిపడింది. తీరా ఇక్కడికి వచ్చాక పింఛన్ ఇవ్వరని తెలిసిందని, ఆటో డబ్బులు ఎవరు ఇస్తారని ఖండేరికి చెందిన దివ్యాంగురాలు రోషమ్మ ప్రశ్నించింది. కాగా ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన పంపిణీ కార్యక్రమం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభించారు. నగర మేయర్ బీవై రామయ్య, కమిషనర్ ఎ.భార్గవ తేజ, అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, కార్పొరేటర్లు హాజరయ్యారు. అయితే కర్నూలు ఎమ్మెల్యే, నగర మేయర్, స్థానిక ప్రజాప్రతినిధులు సమయం పాలన పాటించకపోవడం వల్లే కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభమైనట్లు తెలుస్తోంది.

భయపడేది లేదు

ప్రభుత్వ నోటీసులను దహనం చేసిన అంగన్‌వాడీలు

కర్నూలు(హాస్పిటల్), జనవరి 4: ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగులకు ఇచ్చిన నోటీసులకు భయపడేది లేదని ఏఐటీయూసీ అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు హెచ్చరించారు. ఈ మేరకు నగరంలోని శ్రీకృష్ణదేవ రాయల సర్కిల్‌లో అంగన్‌వాడీల సమ్మె గురువారం 24వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఈ నెల 5వ తేదీన అంగన్‌వాడీలు విధులకు హాజరు కావాలని ప్రభుత్వం ఇచ్చిన నోటీసులను అంగన్‌వాడీ ఉద్యోగులు యూనియన్ నాయకులు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మునెప్ప, చంద్రశేఖర్, సాయిబాబా, సుధాకరప్ప, మహ్మద్ రఫీ, రేణుకమ్మ పాల్గొన్నారు.



కోడుమూరులో..



ప్రభుత్వ నోటీసులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

కోడుమూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోడుమూరులో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 24వ రోజుకు చేరుకొంది. గురువారం టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలిపారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ కోట్ల కవితమ్మ, సర్పంచు భాగ్యరత్న, మాజీ సర్పంచు కేఈ రాంబాబు, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, హేమాద్రిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎల్లప్పనాయుడు, గోపాల్‌నాయుడు, తిరుమల్‌నాయుడు, ఇంతియాజ్ పాల్గొన్నారు.

గూడూరు: అంగన్‌వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ విమర్శించారు. గురువారం గూడూరులో అంగన్‌వాడీ కార్మికులు చేపట్టిన సమ్మె 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జె మోహన్ మాట్లాడుతూ గత 24 రోజులుగా అంగన్‌వాడీ కార్మికులు సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్మికులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో

7న ముగ్గుల పోటీలు



కర్నూలు(కల్చరల్), జనవరి 4: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగుళూరు, రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' ఆధ్వర్యంలో ఈనెల 7న ఉదయం 10 గంటలకు కర్నూలు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నారు. ఏ.క్యాంపులోని మాంటిస్సోరి స్కూల్ (కలెక్టరేట్ వెనుక) మైదానంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఆసక్తిగల మహిళలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. ఎవరి రంగులు వారే తెచ్చుకోవాలి. ముగ్గుల్లో గొబ్బెమ్మలు పేర్చుతూ పువ్వులు, రంగులతో అందంగా అలంకరించుకోవచ్చు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీయ బహుమతి రూ.3వేలు అందజేస్తారు. ముగ్గులు వేసిన ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. వివరాలకు 9291 697777, 8341467704 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

శతాధిక వృద్ధుడి మృతి

పలువురు సంతాపం



రంగన్న (ఫైల్)

కోడుమూరు (రూరల్), జనవరి 4: మండలంలోని వర్కూరు న్యూ ఎస్సీ కాలనీకి చెందిన సుగూరు రంగన్న (104) గురువారం మధ్యాహ్నం వయోభారంతో మృతి చెందాడు. రంగన్న 1920లో జన్మించారు. ఈయన సతీమణి నాగమ్మ 20 ఏళ్ల క్రితమే మృతి చెందారు. ఈ దంపతులకు 11 మంది కూతుళ్లు, ఒక కుమారుడు సంతానం. వీరిలో ప్రస్తుతం ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కొడుకు జాన్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. రంగన్న మృతదేహానికి ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంధ్రయ్య పాస్టర్లు విజయ్, రాజు మాజీ సర్పంచు ఈశ్వరరెడ్డి సర్పంచు మద్దూరు దస్తగిరి, మద్దూ రు దుబ్బన్న, ఎంపీటీసీలు నివాళి అర్పించారు. జాన్ మాట్లాడుతూ తన తండ్రి జొన్న, రాగి సంగటి, కొర్రల అన్నం తినేవాడని, అందువల్లే ఇంతకాలం జీవించ గలిగాడని తెలిపారు. ఇప్పటికీ స్పష్టంగా మాట్లాడుతూ తన అవసరాలను వ్యక్తం చేసేవారన్నారు.

ఖజానా శాఖలో భద్రపరిచిన వస్తువులపై సమావేశం

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 4 : జీవో.135 ప్రకారం జిల్లా ఖజానా శాఖ స్ట్రాంగ్ రూమ్‌లలో మూడు సంవత్సరాలకు పైగా భద్రపరిచిన వస్తువుల వినియోగంపై జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధ్యక్షతన గురువారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం జిల్లా ఖజానా విభాగ కార్యాలయంలోని స్ట్రాంగ్‌రూమ్‌ను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులకు ఆయన పలు సూచనలు జారీ చేశారు. ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్‌లో 3 సంవత్సరాలకు పైబడిన పరీక్షపత్రాలు, దేవదాయశాఖకు చెందిన వస్తువులు, బ్యాలెట్ పేపర్లు, ఖజానా శాఖకు చెందిన చెక్‌బుక్‌లు మొదలైన వాటిని వాటిని భద్రపరుస్తారని అన్నారు. వాటిలో మూడు సంవత్సరాలకు పైబడిన వాటి జాబితాను ఎస్టీవోలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ టి.సర్కార్, డీఆర్వో మధుసూదన్‌రావు, ట్రెజరీ డీడీ రామచంద్రరావు, ఏటీవో జయలక్ష్మి, జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి, డీపీవో నాగరాజు నాయుడు, జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ నాగలింగేశ్వరరావు, ఉపాధి కల్పన అధికారి దీప్తి, డీఈవో రంగారెడ్డి, ఎస్టీవో కరుణాకర్, ఎస్టీవో సునీల్ పాల్గొన్నారు.

20వ తేదీలోపు ఏర్పాట్లను పూర్తి చేయండి

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 4 : జిల్లాలో అన్ని పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలు, సరిహద్దు ప్రాంతాలపై పూర్తిస్థాయిలో నివేదిక, తదితర ఏర్పాట్లను జనవరి 20లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లుతో, జాయింట్ కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీలలో పని చేస్తున్న ఉద్యోగులు విధులకు దూరంగా ఉన్నందున వారి స్థానంలో సచివాలయ వలంటీర్లు, సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదన్ రావు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, సీపీవో హిమప్రభాకర్ రాజు, వ్యవసాయశాఖ, పశుసంవర్ధకశాఖ, గ్రామీణ నీటి సరఫరా తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో విచారణ

కర్నూలు(హాస్పిటల్), జనవరి 4: 2013-14లో మందుల కొనుగోలు తర్వాత బకాయిల చెల్లింపుల విషయంపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ మంజుల కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం విచారణ చేశారు. అప్పటి సూపరింటెండెంట్ మందుల కొనుగోలులో పెండింగ్ బిల్లుల చెల్లింపులో ఓ ఏజెన్సీకి 72 లక్షలు చెల్లింపులపై పత్రికల్లో వచ్చిన కథనాలపై విచారణకు ఆదేశించారు. విచారణలో భాగంగా మొదట ప్రాథమిక విచారణ చేశారు. ఫైనల్ విచారణ ఆసుపత్రిలో ఏడీ కార్యాలయంలో జరిగింది. విచారణలో డీఎంఈ ఆఫీసు ఏవో ఆదిత్య, కర్నూలు డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గూడూరు జనవరి 4: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ అన్నారు. గురువారం గూడూరులో మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె పదో రోజుకు చేరుకోంది. ఈ సందర్భంగా జె మోహన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరి ష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి అనేక దఫాలుగా విన్నవించుకున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అనంతపురం వాసికి కరోనా

కర్నూలు(హాస్పిటల్), జనవరి 4: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక కరో నా కేసు నమోదైంది. గురువారం 67 మంది అనుమానిత బాధితులకు వైద్యు లు ఆర్‌టీపీసీఆర్ టెస్టులు నిర్వహించగా.. అందులో అనంతపురానికి చెందిన 17 ఏళ్ల బాలికకు కరోనా సోకినట్లు కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి తెలిపారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, కండరాళ్ల నొప్పులు, జలుబు, దగ్గు లక్షణాలతో ఉన్న రోగులు తప్పక కరోనా ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేయించుకోవాలని, ఒకవేళ పాజిటివ్ వస్తే వైద్యుల దగ్గరకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని ఆయన సూచించారు.

హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 4: నగరంలోని బీసీ బాలుర, పాణ్యం సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నగర కార్యదర్శి సాయి ఉదయ్‌లు డిమాండ్ చేశారు. గురువారం డీబీసీడబ్ల్యూవో వెంకటలక్ష్మికి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుండా అనారోగ్యాల బారి న పడే విధంగా చేస్తున్నారని, మెనూ ప్రకారం భోజనం అందించాల అన్నారు. తాగేందుకు నీరు లేక బయట కొనుగోలు చేసి తాగుతున్నారన్నారు. అలాగే స్నానం చేయడానికి నీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. చలికాలంలో దోమల బెడద ఎక్కువగా ఉందని, పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం వల్ల విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వితే చర్యలు

కర్నూలు(అర్బన్), జనవరి 4: అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని మైనింగ్‌శాఖ డిప్యూటి డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. గురువారం కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామం జగన్నాథగట్టు సమీపంలోని సర్వే నెంబర్ 477/1బీ లో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు చేశారు. దండోర లక్ష్మన్, వడ్డె శంకర్ రెండు ఎక్స్‌కవేటర్లు అద్దెకు తీసుకుని అక్రమంగా తవ్వకాలు చేస్తున్నట్లు గుర్తించామని, వారిపై తాలుకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్స్‌పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నమ్మసర్కిల్లో సామాజిక సాధికార యాత్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు, జనవరి 2: వైసీపీ ప్రభుత్వం కులమతాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు చెన్నమ్మసర్కిల్లో గురువారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సామాజిక సాధికార యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీలు డాక్టర్ సంజీవకుమార్, గోరంట్లమాధవ్, గురుమూర్తి, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, సుధాకర్, మేయర్ వీవై.రామయ్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గం నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డ్ చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కాటసాని శివనరసింహారెడ్డి, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అడిషనల్ డీఎంఈగా వెంకటరంగారెడ్డికి పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్), జనవరి 4: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డికి అడిషనల్ డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్)గా పదోన్నతి లభించింది. ఈ మేరకు 2023-24 ప్యానల్ సంవత్సరానికి గాను సీనియర్ ప్రొఫెసర్లకు అడిషనల్ డీఎంఈ పదోన్నతులు విడుదల చేశారు. వీటిలో డా.వి. వెంకటరంగారెడ్డికి అడిషనల్ డీఎంఈ పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా డా.వెంకటరంగారెడ్డి తన చాంబరులో కేక్ కట్ చేశారు. ఆయనకు సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, సర్జరీ సీనియర్ ప్రొఫెసర్ మాధవీ శ్యామల, ఆర్ఎంవో వెంకటరమణ అభినందనలు తెలిపారు.

లా ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), జనవరి 4: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరిగిన సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు విడుదల చేశారు. 3, 5 సంవత్సరాలకు సంబంధించి 2,3,5,7,9 సెమిస్టర్ ఫలితాలను కూడా విడుదల చేశారు.

కందులు ప్రభుత్వమే కొంటుంది

కోడుమూరు(రూరల్), జనవరి 4: రైతులు పండించిన కందులను బహిరంగ మార్కెట్ రేటు ప్రకారం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వ్యవసా యాధికారి రవిప్రకాష్ తెలిపారు. మండలంలోని వర్కూరు ఆర్బీకేలో గురువా రం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో రోజువారి ధర మేరకు ప్రభుత్వం చెల్లిస్తుందని, కందులు విక్రయించే రైతులు ఆర్బీకేలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఒక్కో రైతు నుంచి 5 ఎకరాల పరిమితి మేరకు కందులను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు.

మంచి, చెడులపై అవగాహన కల్పించాలి

కోడుమూరు, జనవరి 4: పాఠశాల నుంచే బాలికలకు మంచి, చెడులపై అవగాహన కల్పించాలని బాల స్వాస్థ్య అధికారిని హేమలత అన్నారు. స్థానిక ఏపీ మోడల్ జూనియర్ కళాశాలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు మంచి స్పర్శ, చెడు స్పర్శలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేసే కార్యక్ర మాన్ని చేపట్టారు. అలాగే నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు, రక్తహీనత నివారణ వంటి అంశాలపై విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి, సూపర్‌వైజర్లు, ఉమాబాయి, ఖలీల్ పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణపై కేసు నమోదు

కర్నూలు, జనవరి 4: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సంతోష్‌నగర్‌లో స్థలం ఆక్రమణపై మద్దిలేటి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శంకరయ్య తెలిపారు. సత్యనారాయణ అనే వ్యక్తికి సంతోష్‌నగర్‌లో 5 సెంట్ల స్థలం ఉంది. ఈ స్థలం ఎదురుగా ఉండే అపార్టుమెంటులో మద్దిలేటి అనే వ్యక్తి స్థలం ఆక్రమించుకుని కొంత నిర్మాణం చేపట్టాడు. కరెంటు కనెక్షన్ ఇస్తుండగా.. సత్యనారాయణ అడ్డుకున్నారు. దీంతో సత్యనారాయణపై మద్దిలేటిపై బెదిరింపులకు దిగాడు. బాధితుడు ఎస్పీని ఆశ్రయించగా.. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

హిప్నోసిస్‌తో మానసిక సమస్యలు దూరం



మాట్లాడుతున్న హిప్నోథెరపిస్టు డాక్టర్ శిరిగిరెడ్డి జయారెడ్డి

కర్నూలు(హాస్పిటల్), జనవరి 4: హిప్నోసిస్‌తో మానసిక సమస్యల ను దూరం చేయవచ్చునని హిప్నోథెరపిస్టు, కౌన్సెలింగ్ సైకాలజిస్టు డా.శిరిగిరెడ్డి జయారెడ్డి అన్నారు. ప్రపంచ హిప్నోసిస్ దినోత్సవం సందర్భంగా కల్లూరులోని శ్రీఆదిత్య విద్యానిలయంలో డా.శిరిగిరెడ్డి జయారెడ్డి సైంటిఫిక్ హిప్నోసిస్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ 1734 నుంచి 1950 వరకు వైద్యులు, శాస్త్ర వేత్తలు, ప్రయోగాలు చేసి హిప్నోసిస్ వల్ల మానవులకు ఎన్నో ఉపయో గాలు ఉన్నట్లు గుర్తించారన్నారు. అనంతరం కొంత మంది విద్యార్థులకు పది ప్రశ్నలు ఇచ్చి హిప్నో సిస్ చేయకముందు విద్యార్థులు 5 ప్రశ్నలకు సమాధానం రాయలేదని, హిప్నో సిస్ చేసిన తర్వాత పది ప్రశ్నలకు విద్యార్థులు సమాధానం రాశారని జయారెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఆదిత్య విద్యానిలయం ప్రిన్సిపాల్ బి.వాసుదేవయ్య, శ్రీనివాసరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మోటార్లకు బిగించిన మీటర్లు ధ్వంసం

కల్లూరు, జనవరి 4: మండలంలోని ఉలిందకొండ గ్రామంలో వ్యవసాయ మోటార్లకు బిగించిన మీటర్లను రైతులు, ఏపీ రైతుసంఘం నాయకులు గురువారం ధ్వంసం చేశారు. ఈసందర్భంగా ఏపీ రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఏ.క్రిష్ణ, సీఐటీయూ మండల కార్యదర్శి కె.మధు మాట్లాడుతూ వర్షాలు లేక పంటలు పండక రైతులు ఇబ్బందులు పడుతుంటే వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఎలా పెడతారని ప్రశ్నించారు. విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి రైతులు లేని సమయంలో మీటర్లు బిగించవద్దని సూచించారు. కార్యక్రమంలో శేఖర్, రాజు, చిన్నరాముడు, గొల్లరాముడు, మౌలాలి పాల్గొన్నారు.

మోటార్లకు మీటర్లు వద్దు

ఓర్వకల్లు, జనవరి 4: వ్యవసాయ మోటార్లకు మీటర్లు వద్దని రైతు సంఘం నాయకులు మధుసూదన్, మల్లేష్ అన్నారు. గురువారం డీఆర్వోకు వారు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల మోటార్లకు మీటర్లు బిగించడం వారి మెడకు ఉరితాడుగా మారుతుం దని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే ఈ విధానాన్ని విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాసూంబాషా, దస్తగిరి, కంబగిరి పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి నీటి సౌకర్యం కల్పిస్తాం

కర్నూలు(న్యూసిటీ), జనవరి 4: ఉమ్మడి జిల్లాలోని ప్రతి గ్రామానికి జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. జడ్పీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి గురువారానికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి, చైర్మన్ సీసీ అశ్వినికుమార్, పరిపాలన అధికారులు సి.మురళీమోహన్‌రెడ్డి, సి.రాంగోపాల్, జితేంద్ర, బసవశేఖర్, సరస్వతమ్మ, సౌభాగ్యలక్ష్మి, గాయత్రి పాల్గొన్నారు.

మోడరేషన్ కమిటీ సభ్యుల ఎంపికలో అక్రమాలు

కర్నూలు(అర్బన్), జనవరి 4: బీఈడీ కళాశాలల యాజమాన్యాలు మోడరేషన్ కమిటీ సభ్యుల ఎంపికలో అక్రమాలకు పాల్పడుతున్నాయని ఎంఈడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకట సుందరానంద పుచ్చాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సెమిస్టర్‌లో రికార్డుల వెరిఫికేషన్ కోసం అన్ని కళాశాలల్లో విధులు నిర్వహించే సిబ్బందే స్టాఫ్ అప్రువల్ కలిగిన సీనియర్ అధ్యాపకులను నియమించే వారని, కాని ప్రస్తుతం ఈనెలలో జరిగే ఒకటో సెమిస్టర్ రికార్డుల వెరిఫికెషన్‌కు అర్హతలేని వారిని కళాశాల యాజామాన్యాలు నియమిస్తున్నాయని ఫిర్యాదు చేశారు. వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోమశేఖర్ గౌడ్, చంద్రశేఖర్, శరత్ బాబు, మాధవకృష్ణ పాల్గొన్నారు.

నాటు సారా స్వాధీనం

కర్నూలు, జనవరి 4: కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. స్థానిక రాఘవేంద్రనగర్‌లో శ్రీరామ్ అనే వ్యక్తి నాటుసారా విక్రయిస్తుండగా.. పోలీసులు గుర్తించారు. పోలీసులు రాకను గుర్తించి శ్రీరామ్ అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు సారా స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో

7న ముగ్గుల పోటీలు



ఆదోని, జనవరి 4: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' ఆధ్వర్యంలో ఈనెల 7న ఉదయం 10 గంటలకు ఆదోనిలో నిర్వహిస్తున్నారు. ఆదోని మిల్టన్ గ్రామ ర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ మైదానంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఆసక్తిగల మహిళలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. ఎవరి రంగులు వారే తెచ్చుకోవాలి. ముగ్గుల్లో గొబ్బెమ్మలు పేర్చుతూ పువ్వులు, రంగులతో అందంగా అలంకరించుకోవచ్చు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీయ బహుమతి రూ.3వేలు అందజేస్తారు. ముగ్గులు వేసిన ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. వివరాలకు 9440238279, 9640551145 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

నిష్పక్షపాతంగా సేవలు అందించాలి



ఎస్ఐగా ఎంపికైన కరిష్మా, ఆమె తల్లిదండ్రులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, జనవరి 4: ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలు అందించాలని ఇటీవల ఎస్ఐగా ఎంపికైన పట్టణానికి చెందిన కరిష్మాకు మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని నాగప్పకట్టల ప్రాంతంలోని రఫీక్, జరినా దంపతుల కుమార్తె కరిష్మా ఎస్ఐగా ఎంపికైంది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి వారి ఇంటికి వెళ్లి కరిష్మా, ఆమె తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ ముస్లీం మైనార్టీ తాలుక కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఉసేన్ పీరా, తురేగల్ నజీర్, నాయకులు కాశీం వలి, బడేసాబ్, మహబూబ్ బాషా, గౌస్, అబ్దుల్, గిడ్డయ్య, సురేష్ చౌదరి, విక్టర్ నవోదయ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు ఖాజా హుసేన్‌లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



రోడ్డుపై భోజనం చేస్తు నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ఆదోని టౌన్, జనవరి 4: మున్సిపల్ పారిశుధ్య కార్మికులు గురువారం ప్రధాన రహదారులలో ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకన్న ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. తమ డిమాండ్ల సాధన కోసం వారు చేస్తున్న సమ్మె రెండో రోజుకు చేరింది. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్క రించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఓబీ నాగరాజు, పట్టణ అధ్యక్షుడు భీమేష్, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు సుదర్శన్, కల్లు బావి రాజు, మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు జయరాజ్, జాన్ బాబు, శేఖన్న, శాంత, సుశీలమ్మ, నాగరాజు, నరసింహులు పాల్గొన్నారు.

రోడ్డుపై భోజనం చేస్తూ నిరసన

ఎమ్మిగనూరు: మున్సిపల్ కార్మికులను రోడ్డు పాలు చేశారని ఏఐటీయూసీ తాలుకా సహాయ కార్యదర్శి రంగన్న, సీఐటీయూ కార్యదర్శి రాముడు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ప్రసాద్ అన్నారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారానికి 10వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మున్సిపల్ కార్యాలయం నుంచి శివ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న ప్రధాన రహదారిపె భోజనం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. సమ్మెకు మున్సిపల్ ఉద్యోగులు సంఘీభావం తెలిపారు. నాయకులు విజేంద్ర, మున్సిపల్ వర్కర్స్ యునియన్ నాయకులు ఎల్లప్ప, శివకృష్ణ, సీఐటీయూ నాయకులు ఇస్మాయిల్, కేశన్న, మల్లికార్జున, రవి, పల్లవి రాజు, ఐఎఫ్‌టీయూ నాయకులు ప్రతాప్, కిరణ్, రాజేష్, దేవపుత్రలు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

ఆలూరు రూరల్, జనవరి 4: వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ అన్నారు. ప్రజాగ్రహానికి తట్టుకోలేక ఎంపీలు, ఎమ్మెల్యేలు వైసీపీకి గుడ్‌బై చెబుతున్నారని కోట్ల సుజాతమ్మ గురువారం పత్రికా ప్రకటనలో తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పదేళ్లు వెనక్కి నెట్టిందని విమర్శించారు. ఒక్క ఛాన్స్‌తో ప్రజల విశ్వాసం కోల్పోయిన జగన్ రెడ్డి సొంత సీటు పోటీ చేసేందుకు సిద్ధంగా లేరని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఓటు తో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు.

నిరసన దీక్షలను జయప్రదం చేయండి

ఆలూరు, జనవరి 4: విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూసీ) ఆధ్వర్యంలో ఈనెల 8న ఎస్ఈ కార్యాలయం వద్ద తలపెట్టిన నిరసన దీక్షలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కేపీ నారాయణస్వామి, యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డివిజన్ కార్యదర్శి మాబు పిలుపునిచ్చారు. గురువారం ఆలూరు పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూసీ జిల్లా నాయకులు షాకీర్, నాయకులు సోము, స్వామి పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం

ఆదోని(అగ్రికల్చర్), జనవరి 4: ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయ కుండా వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని ఆదోని నిరుద్యోగ, విద్యార్థి జేఏసీ చైర్మన్ తిరుమలేష్, సలహాదారులు మల్లికార్జున ఆరోపించారు. గురువారం ప్రభుత్వ తీరుకు నిరసనగా నిరుద్యోగ జేఏసీ నాయకులు భీమాస్ కూడలిలో నిరసన తెలిపారు. నాయకులు భీమ్‌రెడ్డి, రాజు, కృష్ణ, శివ, ఉదయ్, పరమేష్, నరసింహులు, వంశీ పాల్గొన్నారు.

టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవాలి

ఆలూరు, జనవరి 4: ఆలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే టికెట్టు కేటాయింపులో కురువలకు ప్రాధాన్యం ఇవ్వాలని సంఘం వ్యవస్థాపక అధ్యక్షు డు డీ రంగన్న, తెలుగు రాష్ట్రాల మదాసి కురువ, మదారి కురువ సమన్వయకర్త మదాసి కురువ తిమ్మప్ప డిమాండ్ చేశారు. గురువారం వారు కురువ శశికళ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కురువలకు ప్రాధాన్యం కల్పించిన రాజకీయ పార్టీలకే తమ ఇస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు శేషప్ప, సర్పంచ్ సుధాకర్, రంగన్న, రిజర్వేషన్‌ల పోరాట సమితి అధ్యక్షుడు కేటీ పెద్దయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంబగుండు రాజు, రాష్ట్ర కార్యదర్శి కారుమంచప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జప్ప, విరుపాపురం మల్లికార్జున, జోలాపురం వీరేంద్ర, కడియాల శివ, మధు, మురళి, కొమ్మె లింగమూర్తి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

వెల్దుర్తి, జనవరి 4: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల అంగన్‌వాడీ వర్కర్లు చెట్టుకు వేలాడదీసిన ఉరి తాళ్లు గొంతులో వేసుకొని వినూత్న నిరసన తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ తలపెట్టిన నిరవధిక దీక్షలు గురువారం నాటికి 24 వ రోజుకు చేరాయి. మండల కార్యదర్శులు ఈదమ్మ, చాందినీ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. 24 రోజులుగా నిరవధిక నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో మద్దిలేటమ్మ, లక్ష్మీశ్వరమ్మ, మహబుబీ, షబానా, సుకన్య, పెప్సీబా పాల్గొన్నారు.

ఆస్పరి: అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించకపోతే తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ మండల కార్యదర్శులు విరుపాక్షి, హనుమంతు, కృష్ణమూర్తి హెచ్చరించారు. గురువారం అంగనావాడీల 24వ రోజు నిరసన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీలు వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా, జగన్ సర్కార్‌కు చీమ కుట్టినట్లు కూడా లేదని ధ్వజమెత్తారు. స్పృహ తప్పిపోయిన ప్రాజెక్టు లీడర్: నిరసన కార్యక్రమంలో పాల్గొన్న అంగ న్‌వాడీల ప్రాజెక్టు లీడర్ శ్రీదేవి స్పృహ తప్పి కింద పడిపోయారు. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. కార్యక్రమంలో రంగస్వామి, రామాంజనేయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదోని: అంగన్‌వాడీలు న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని అంగన్‌వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ, వరలక్ష్మీ, సరోజ, జానకి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారానికి 24 రోజుకు చేరింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాదయాత్రలో జగన్మోహన్ రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీ లను నెరవేర్చేవరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పద్మ, రేణుక, సరోజ, సోమక్క, గీత, వీరమ్మ, మీనాకుమారి, రిజ్వానా, శారద, ఈరమ్మ పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: అంగన్‌వాడీపై దాడులు చేసిన ప్రభు త్వాలకు పుట్టగతులుండవు అని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కేపీ నారాయణ స్వామి అన్నారు. గురువారం అంగన్‌వాడీల సమస్య లను పరిష్కరించాలని 24వ రోజు సమ్మెలో భాగంగా ఆలూరులో సమ్మె శిబిరంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి సీఐటీయూ నాయకులు కృష్ణ, డీవైఎఫ్ఐ నాయకులు గోవర్ధన్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె గురువారంతో 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కృష్ణవేణి, గోవర్ధనమ్మ, నాగశిరోమణి, నీరజ మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు సమ్మెను విరమింపజేసేది లేదన్నారు. 5వ తేదీలోపు విధుల్లో చేరకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశాలు జారీ చేయడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వ బెదరింపులకు భయపడేది లేదని అన్నారు. ఇచ్చిన హామీలు అన్ని నెరవెర్చకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూసి, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ. నాయకులు రాముడు, తిమ్మగురుడు, రాజు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: పెద్దకడుబూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కౌతాళం: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని టీడీపీ జిల్లా సీనియర్ నాయకులు రాఘవేంద్రరెడ్డి, రాష్ట్ర నాయకులు ఉలిగయ్య, పల్లిపాడు రామిరెడ్డి అన్నారు. గురువారం కౌతాళంలో అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మెకు టీడీపీ నాయకులు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి సురేష్ నాయుడు, రాకేష్‌రెడ్డి, సీఐటీయూ, జనసేన నాయకులు మల్లయ్య, రామాంజినేయులు, టీడీపీ నాయకులు రామలింగప్ప, నీలకంఠప్ప, టీడీపీ కార్యకర్తలు, విజయలక్ష్మి, రోజ్ మేరి, రేణుక, సుధ, చామేండేశ్వరి పాల్గొన్నారు.

మంత్రాలయం: అంగన్‌వాడీ వర్కర్ల న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం చేస్తుంటే.. తమపై ప్రభుత్వం సాధింపు చర్యలకు పాల్పడితే.. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. గురువారం మంత్రాలయంలో చేపట్టిన సమ్మె 24వ రోజుకు చేరింది. అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. సీఐటీయూ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



వెల్దుర్తిలో ఉరి తాళ్లతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



మంత్రాలయంలో..

వైసీపీ మునిగిపోయే నావ : మాజీ ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, జనవరి 4: వైసీపీ మునిగిపోయే నావ అని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని పట్టణంలోని 10, 14వ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే తెలుగుదేశం అధికారంలోకి వస్తే ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. టీడీపీ నిజమైన బీసీ పార్టీ అని అన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: మూడు పర్యాయాలుగా ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డి గెలిచినా మంత్రాలయం నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి ఆరోపించారు. రాగిమాన్‌దొడ్డి గ్రామంలో గురువారం 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాబురావు, టీడీపీ నాయకులు రాఘవేంద్ర స్వామి, నరసింహారెడ్డి, ప్రతాపరెడ్డి, ఆంజనేయులు, రాముడు, వెంకటరెడ్డి, నరసన్న పాల్గొన్నారు.

వెల్దుర్తి: మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉందని మండల టీడీపీ నాయకులు అన్నారు. మండలంలో క్రిష్ణాపురం గ్రామంలో గురువారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం మండల అధ్యక్షుడు బలరాం గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

మంత్రాలయం: వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం మండలం లోని వి.తిమ్మాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి యల్లారెడ్డి, నాయకులు కేశన్న, అబ్దుల్లా, పవన్ కుమార్ రెడ్డి, గోపాల్, దస్తగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు.

పథకాల అమలులో వైసీపీ విఫలం: తిక్కారెడ్డి



జగన్ హామీలు ఫెయిలైన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తిక్కారెడ్డి

మంత్రాలయం, జనవరి 4: రాష్ట్రంలో పథకాల అమలులో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి ఆరోపించారు. గురువారం పంకజ్ అతిథి గృహంలో వైసీపీ పథకాలు, ఫెయిలైన హామీల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గత పాదయాత్రలో ఇచ్చిన 199 హామీలు కాగా, అమలైనవి మాత్రం కేవలం 17, అరకొరగా అమలైనవి 73, పూర్తిగా అమలు కానివి 109 పథకాలు ఉన్నాయని చెప్పారు. 85 శాతం పథకాలు ఫెయిల్ అయ్యాయన్నారు. రాష్ట్రంలోని ఒక్కో కుటుంబానికి రూ.8,25,549 అప్పు మోపారని ఆరోపించారు. చంద్రబాబు అరెస్టు సమయంలో గుండెపోటుతో మరణించిన వారి కుటుంబాలకు ఈ నెల 10న నారా భువనేశ్వరి మంత్రాలయం నియోజకవర్గంలో పర్యటించి ఆర్థిక సాయం అందజేస్తారని తెలిపారు. మంత్రాలయం నియోజకవర్గంలో టీడీపీ హయాంలో రూ.1900 కోట్లతో ఆర్డీఎస్ కుడి కాలు వకు నిధులు మంజూరు, 5 ఎత్తిపోతల పథకాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. ఇంత వరకు పూర్తి చేయకుండా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి విఫలమయ్యారని ఆరోపించారు. దోచుకోవడం, దాచుకోవడం తప్ప రాష్ట్రానికి చేసింది మాత్రం శూన్యమేనన్నారు. పార్టీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్, అశోక్ రెడ్డి, విజయరామిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి యేబు, ఎంపీటీసీ మేకల వెంకటేశ్, చిన్న భీమయ్య పాల్గొన్నారు.

9న భువనేశ్వరి పర్యటన

పత్తికొండ, జనవరి 4: నిజం గెలవాలి యాత్రలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి ఈ నెల 9న పత్తికొండ నియోజకవర్గానికి రానున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు తెలిపారు. నారాచంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలను ఆమె పరామర్శించి ఆకుటుంబాలకు ఆర్థికసాయం అందిస్తారన్నారు. పర్యటన వివరాలు పూర్తిగా తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

'టీడీపీ హయాంలోనే అభివృద్ధి'

నందవరం, జనవరి 4: టీడీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మార్కెట్ యార్డు మాజీచైర్మన్ దేశాయి మాధవరావు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మిగనూరు నియోజకవర్గ అభివృద్ధి దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి, ఆయన తనయుడు మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి కృషి చేశారన్నారు. టీడీపీ హయాంలో నందవరం సాగు, తాగునీరు అందించారని, రోడ్లు అభివృద్ధి చేశారని చెప్పారు. వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ఈరన్న, శ్రీనివాసులు, లింగప్ప, వీరేష్, వలి పాల్గొన్నారు.

114 తెల్లకార్డులు మంజూరు

మద్దికెర, జనవరి 4: మండలానికి 114 తెల్ల రేషన్‌కార్డులు మంజూరయ్యాయని తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని తెల్లరేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను గుర్తించి ఎంపిక చేశామని, సంబంధిత వీఆర్వోలు ఆ తెల్లకార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని తహసీల్దార్ తెలిపారు. లబ్ధిదారులు సంబంధిత వీఆర్వోలను సంప్రదించి కార్డులు తీసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు ఉన్నారు.

రామ్‌నగర్‌కు ఉచిత కొళాయిలు ఇవ్వండి

మద్దికెర, జనవరి 4: మద్దికెరలోని వెనుకబడిన రామ్‌నగర్ కాలనీకి జల్‌జీవన్ కింద ఉచిత కొళాయి కనెక్షన్ ఇవ్వాలని టీడీపీ పంచాయతీ సభ్యులు ఎన్.లక్ష్మినారాయణ, జమేదారు వెంకట్రాయుడు కోరారు. గురువారం ఈవోఆర్‌డీకి వినతి పత్రాన్ని అందజేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జల్‌జీవన్ కింద స్థానిక సాయి నగర్ కాలనీలో ఉచిత కొళాయిలు ఇచ్చారని, రామ్‌నగర్‌లో ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

ఆశాలను ఉద్యోగులుగా గుర్తించాలి

దేవనకొండ, జనవరి 4: ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరసరావు ,జిల్లాసహాయ కార్యదర్శి తులసి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఆశావర్కర్స్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీలకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు రాధిక, రాధా, అరుణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కందులకు గిట్టుబాటు ధర కల్పించాలి

తుగ్గలి, జనవరి 4: ఈ ఏడాది పండించిన కంది పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని తాలుకా తెలుగు రైతు వ్యవసాయ సంఘం ఉపాధ్యక్షుడు బాలన్న, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ స్వామి యాదవ్, రవి యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం జొన్నగిరిలో వారు మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులకు పెట్టుబడులు కూడా దక్కడం లేదని, ఇలాంటి తరుణంలో బయటి మార్కెట్‌లో దాదాపు రూ.9వేలు ధర పలుకుతుంటే.. ప్రభుత్వం మాత్రం రూ.7వేలు గిట్టుబాటు ధర కల్పిస్తామనడం దారుణమని పేర్కొన్నారు. కనీస మద్దతు ధర రూ.10వేలతో కొనుగోలు చేస్తే రైతులకు మేలు చేసిన వారవుతారని కోరారు.

'అల్లర్లకు పాల్పడితే కేసులు'

మంత్రాలయం, జనవరి 4: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని మాధవరం ఎస్ఐ కిరణ్‌బాబు హెచ్చరించారు. గురువారం రాత్రి మండలంలోని చౌలెహల్లి గ్రామంలో పల్లెనిద్రలో బాగంగా గ్రామస్థులతో గ్రామ సభ ఏర్పాటు చేశారు. బాల్యవివాహాల నివారణ, అక్షరాస్యత, దిశా యాప్, పోలాల తగాదాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు.

సారా స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

ఆదోని రూరల్, జనవరి 4: ఆదోని పట్టణంలోని బోయగేరికి చెందిన శివ గురువారం నాటు సారాను తరలిస్తుండగా ఇస్పీ పోలీసులు అతడిని అదుపులో తీసుకొని 10లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అదేవిధంగా అలసందగుత్తి గ్రామానికి చెందిన బోయ రాముడు తన ఇంటి ఆవరణలో సారా అమ్ముతుండగా అదుపులో తీసుకొని అతని వద్ద నుంచి 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తాలుకా ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు.

వాళ్లను తొలగించండి

సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులపై ఉన్నతాధికారుల సీరియస్

ఆలూరు, జనవరి 4: 'సమ్మెలోకి ఏ ఉద్యోగి వెళ్లినా ఉపేక్షించకుండా సర్వీసుల నుంచి తొలగించండి. మేము చూసుకుంటాం. ధైర్యంగా తొలగించే ప్రిన్సిపాల్స్‌ను అభినందిస్తాం...' అంటూ రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులతో పాటు కేజీబీవీలో విధులు నిర్వహిస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది కనీస వేతనం, మినిమం టైంస్కేల్, క్రమబద్ధీకరణ కోసం సమ్మెబాట పట్టారు. దీంతో ఆగ్రహించిన రాష్ట్రస్థాయి అధికారులు సమీక్ష నిర్వహించారు. కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాలో ఎంతమంది సమ్మెలోకి వెళ్లారు..? వెళ్లినవారు 7వ తేదీలోగా రాకపోతే వారిని సర్వీసుల నుంచి తొలగించాలని ఆదేశించారు. వారి స్థానంలో కొత్త వారిని నియమించాలని సూచించారు. ఒకవేళ ప్రిన్సిపాల్ సమ్మెలోకి వెళ్తే నోటీసులు ఇవ్వకుండా తొలగించాలని జీసీడీవో, ఏపీసీలను ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు, ఆడియో సంభాషణ ఉద్యోగుల వాట్సాప్ గ్రూపులో హల్‌చల్ చేస్తున్నాయి. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా బెదిరింపులకు దిగడం సరైన పద్ధతి కాదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు ఆగ్రహం వ్యం చేశారు.

నిబంధనల మేరకే స్థలాన్ని లీజుకు ఇచ్చాం

ఆదోని(అగ్రికల్చర్), జనవరి 4: పట్టణంలోని ఏపీ ఎన్జీవోస్ కార్యాలయ స్థలా న్ని బైలాస్ ప్రకారం నిబంధనల మేరకే లీజుకు ఇచ్చామని ఏపీ ఎన్జీవోస్ తాలుకా అధ్యక్షుడు రమేష్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఏపీ ఎన్జీవోస్ భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 70ఏళ్ల ఎన్జీవో భవనం శిథిలా వస్థకు చేరుకోవడంతో కొత్త భవన నిర్మాణానికి రాష్ట్ర, జిల్లా కమిటీలో తీర్మాణం చేశామన్నారు. ఇది కేవలం ప్రభుత్వ ఉద్యోగులమైన ఏపీ ఎన్జీవోస్ సంబంధించిన స్థలమని, ప్రభుత్వానికి సంబంధించినది కాదన్నారు. పేపరు ప్రకటన ద్వారా ఓ కాంట్రాక్టర్‌కు నిర్మాణానికి అప్పజెప్పమన్నారు. సదరు కాంట్రాక్టర్లు రూ. 40 లక్షలు తమకు చెక్కు రూపంలో ఇచ్చారన్నారు. ఆయన మా భవనం నిర్మించి మిగిలిన ఆరు సెంట్ల స్థలంలో భవనాన్ని నిర్మించుకున్నారన్నారు. ఆ భవనానికి అద్దె చెల్లించేలా ఒప్పందం చేసుకున్నామన్నారు. అయితే ఆయన ఓ పార్టీ కార్యాలయానికి అద్దెకి ఇచ్చుకున్నారు. దానికి మాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తాలుకా పెన్షనర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాసిన్ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, గౌస్ పీరా పాల్గొన్నారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జనవరి 4: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. రాఘవేంద్ర స్వామి సజీవ సమాధి పొందిన గురువారం శుభదినం పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి పూజలు నిర్వహించారు. బృందావనాన్ని శోభాయమానంగా అలంకరించారు. ప్రహ్లాదరాయలను ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల సేవ నిర్వహించారు.

శ్రీమఠం గోశాలకు 19 ట్రాక్టర్ల పశుగ్రాసం

మంత్రాలయం, జనవరి 4: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలకు రూ.475 లక్షల విలువ చేసే 19 ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని విరాళంగా ఇచ్చారు. గురువారం రాయచూరు జిల్లాలోని సిరువార తాలుకా మస్కి తాలుకాలోని గ్రామాలకు చెందిన మోహన్, దొరబాబు, క్రిష్ణ, మౌనేష్, వెంకటేశ్ నాయక్ ఆధ్వర్యంలో ఒక్కో ట్రాక్టరు పశుగ్రాసం రూ.25 వేల విలువ చేస్తుంది. 19 ట్రాక్టర్లలో పశుగ్రాసాన్ని విరాళంగా అందించారు. మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు విరాళం ఇచ్చిన దాతలను అభినందించి శేషవస్త్రం, ఫల పుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, గోశాల సూపర్‌వైజర్ దేశాయ్ రాఘవేంద్రరావు, జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, అసిస్టెంట్ మేనేజర్ నరసింహమూర్తి, ద్వార పాలక అనంత స్వామి, గోశాల సిబ్బంది దమ్ము అంజి, నర్సిరెడ్డి, మల్లేష్, గురురాజ్ పాల్గొన్నారు.

కొత్తపల్లి బీటీ రోడ్డు ప్రారంభం

పత్తికొండ టౌన్, జనవరి 4: మండల పరిధిలోని రూ.6 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన దూదేకొండ-కొత్తపల్లి బీటీ రోడ్డును ఎమ్మెల్యే శ్రీదేవి గురువారం ప్రారంభించారు. అనంతరం కొత్తపల్లిలో జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించడమే కాక.. కులమతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణ దాసు, మాజీ సర్పంచు సోమశేఖర్, నాయకులు తిప్పయ్య, వైస్ ఎంపీపీ బలరాముడు, బాబుల్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో నూతనంగా మంజూరైన కొత్త పింఛన్లన ఎమ్మెల్యే శ్రీదేవి పంపిణీ చేశారు. ఎంపీడీవో కవిత, ఎంపీపీ నారాయణదాసు, జడ్పీటీసీ ఉరుకుందమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలామృతం ఇవ్వకండి



అధికారులతో వాగ్వాదం చేస్తున్న అంగన్‌వాడీలు

మద్దికెర, జనవరి 4: ప్రభుత్వం దిగి వచ్చి తమ సమస్యలు పరిష్కరించే వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలామృతం ఇవ్వవద్దని అంగన్‌వాడీ కార్యకర్తలు డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఎస్ఐ రిజ్వాన్ మహ్మద్‌తో వాగ్వాదానికి దిగారు. గురువారం ప్రభుత్వం మం జూరు చేసే బాలామృతం ఆయా కేంద్రాలకు సరఫరా చేస్తున్నారని విష యం తెలుసుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలు వ్యాన్‌ను అడ్డుకున్నారు. 22 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ఐ రవికుమార్, వీఆర్వో రంగస్వామి ఉన్నారు.

తుగ్గలి: నెల రోజులు నుంచి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పట్టవా అని, ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపో వడం అన్యాయమని సీపీఎం మండల అధ్యక్షుడు శ్రీరాములు, అంగన్ వా డీ టీచర్లు అన్నారు. గురువారం మండల పరిధిలోని జొన్నగిరిలో గర్భిణులకు, బాలింతలకు ఇచ్చే బాలామృతం సరుకుల పంపిణీని అడ్డుకున్నారు.

షర్మిల రాకతో కాంగ్రెస్ బలోపేతం

ఆదోని టౌన్, జనవరి 4: వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పార్టీకి పూర్వ వైభవం వచ్చిందని పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎంఎండీ నూర్ అహమ్మద్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆమె రాకను నాయకులంతా స్వాగతించడం సంతోషంగా ఉందన్నారు.

● షర్మిల కాంగ్రెస్ పార్టీకు రాష్ట్ర అధ్యక్షురాలిగా పగ్గాలు చేపడితే రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో విజయం సాధిస్తుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీలకంఠప్ప, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీరావు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

ఆలూరు: కాంగ్రెస్ పార్టీలోకి వైయస్ షర్మిల చేరడంతో ఏపీలో తిరుగులేని శక్తిగా మరబోతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిప్పగిరి లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఆయన స్థానిక ఆర్&బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు.

సారు చెప్పినట్లే జరుగుతుంది

- నా సొంత నిర్ణయాలు ఏమీ ఉండవు
- వైసీపీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జి మాచాని వెంకటేశ్వర్లు

గోనెగండ్ల, జనవరి 4: ఎమ్మిగనూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పదవి ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి సార్ పెట్టిన భిక్ష అని, పార్టీ నిర్ణయాలలో తన ప్రమేయం ఉండదని.. అంతా సారు చెప్పినట్లే జరుగుతుందని వైసీపీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జి మాచాని వెంకటేశ్వర్లు మాట్లాడడం చర్చనీయాంశంగా మారింది. గోనెగండ్లలోని ఎంపీడీవో ఆవరణలో గురువారం పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పింఛన్ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సభలో కొత్తగా వైసీపీ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన మాచాని వెంకటేశ్వర్లు మాట్లాడారు. తమ కుటుంబం ఎప్పటి నుంచో చెన్నకేశవరెడ్డికి వర్గంగా ఉందని అన్నారు. రాజకీయాలకు కొంత దూరంగా ఉంటున్నానని, అయితే సార్ పిలిపించి వైసీపీ టికెట్ ఇస్తామని చెప్పారని తెలిపారు. తమ బంధువుల సూచనల మేరకు ఒప్పుకున్నానని చెప్పారు.

కార్యక్రమానికి మరో వర్గం దూరం: మాచాని వెంకటేశ్వర్లును వ్యతిరేకించే మరో వర్గం పింఛన్ పంపిణీ కార్యక్రమానికి హాజరు కాలేదు. దీంతో పార్టీలో రెండు వర్గాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. వైసీపీ లోని ఓ వర్గం వెంకటేశ్వర్లును ఇన్‌చార్జిగా నియమించడాన్ని బహిరంగంగానే వ్యతిరేకిస్తోంది.

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

మంత్రాలయం, జనవరి 4: మంత్రాలయంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం-2 హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు సీతారామిరెడ్డిలు గురువారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. గురెడ్డి భీమిరెడ్డి, సీపీ విశ్వనాథరెడ్డి, డీఈ అశ్వర్థామ, హౌసింగ్ డీఈ లాల్‌క్రిష్ణయ్య, మండల అధికారులు పాల్గొన్నారు.